

యాదగిరిగుట్ట : బాహుపేటలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, డీసీపీ రాజేశ్‌చంద్ర

బాహుపేట గ్రామ అభివృద్ధికి సహకరిస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట, జూలై 28 : బాహుపేట గ్రామ సమగ్రాభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని బాహుపేట గ్రామంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన వైర్‌లైస్ సీసీ కెమెరాలు, బాహుపేట, కుమ్మరిగూడెంలో మినరల్ వాటర్ ఫిల్టర్లను డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో ఆలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రమేశ్‌కుమార్, సీఐలు రమేశ్, కొండల్‌రావు, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, నాయకులు భరత్‌గౌడ్, రాములు, వీరయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆలేరు రూరల్ : మండలంలోని మందనపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన బాధితులను ప్రభుత్వ విప్ ఐలయ్య పరామర్శించారు. బాధితులు జువ్వగాని పారిజాత భాస్కర్‌గౌడ్‌కు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న మావురం కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, జూలై 28 : పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే లింక్ రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. అమ్మనబోలు – రామన్నపేట డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించి పట్టణ కేంద్రానికి కొత్త శోభ అందిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురిగిరెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, నాయకులు జగన్మోహన్, ప్రభాకర్, బాలకిషన్, కృష్ణారెడ్డి, కృష్ణగౌడ్, శిరీష, నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, రేహాన్ పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో భక్తుల కోలాహలం

- ఆర్కే ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ అమరేందర్, ధర్మకర్త గోపికృష్ణ

భువనగిరి కలెక్టరేట్, జూలై 28 : యాదాద్రి తిరుమల దేవస్థానం స్వర్ణగిరిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆర్డీసీ ఎండీ సజ్జనార్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భువనగిరి పట్టణానికి చెందిన ఆర్కే ఆసుపత్రి అధినేత డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆర్డీఓ అమరేంద్, ఆలయ ధర్మకర్త గోపికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్కే ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందాలనే సంకల్పంతో పల్లెకు వైద్యం పేరుతో ఉచిత శిబిరాలు చేపట్టడం సంతోషదాయకమని కొనియాడారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం : బీఆర్ఎస్‌వీ

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు నాగరాజు

ఆత్మకూరు(ఎం), జూలై 28 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగానికి రూ.21.389 కోట్లు కేటాయిస్తే.. కాంగ్రెస్ సర్కారు రూ.21.292 కోట్లు కేటాయించిందన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్యా రంగానికి 30శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ మండల సెక్రెటరీ జనరల్ గజ్జెల్లి మహేశ్, నాయకులు నవీన్, రాజు, మణికుమార్, వినయ్, విఘ్నేశ్ పాల్గొన్నారు.

'ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

హామీలను అమలు చేయాలని అంబేద్కర్ విగ్రహం వద్ద వినతి పత్రాలతో తెలంగాణ ఉద్యమ కారులు

వలిగొండ, జూలై 28 : ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమ కారులకు న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిష్టఫర్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను శాసనసభలో తీర్మానం చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారగోని శ్రీనివాస్, శీలం స్వామి, లావణ్య, జోగు అంజయ్య, మల్లం వెంకటేశం, గంధమల్ల మల్లమ్మ, అయిటిపాముల పుష్ప, సిర్పంగి గణేశ్, మల్లేశం పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుర్కపల్లి, జూలై 28 : మండలంలోని మాదాపురం గ్రామానికి చెందిన కటిక సురేశ్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.28వేల చెక్కును ఆదివారం బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారం రాజు అందజేశారు. మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సహకారంతో మంజూరైన చెక్కును లబ్ధిదారుడికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలనర్సింహ, లక్ష్మణ్, సుదర్శన్, మహేశ్, ఐలయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు

ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, జూలై 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు నిత్యోత్సవాలు పాంచరాత్రగమశాస్త్రరీతిలో ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవ నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వయంభూ నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ధర్మ దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అర్ధగంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 17వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.23,53,996 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సర్వస్వతి స్వామీజీ ప్రవచనాలు వినిపించారు.

స్వామివారిని దర్శించుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు.

గుట్టలో పర్యాటక అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

యాదగిరిగుట్టలో పర్యాటక ప్రాంతాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం కొండపైన హరిత హోటల్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. హోటల్‌లో మొత్తం 20 గదులు ఉండగా.. ప్రస్తుతం 15 రూములను వాడుతున్నట్లు తెలిపారు. మిగతా 15 రూములను త్వరలో వాడుకలోకి తీసుకొస్తామన్నారు. గుట్టలో టూరిజానికి కేటాయించిన నాలుగు ఎకరాల స్థలాన్ని భక్తుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి యాదగిరిగుట్టతోపాటు కొలనుపాకను సైతం అభివృద్ధి చేస్తామన్నారు.

31న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్

కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్

భువనగిరి అర్బన్, జూలై 28 : ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 31న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాలో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. భువనగిరి పట్టణంలో ఆటో యూనియన్ ముఖ్య నాయకులతో కలిసి ఆదివారం మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 8నెలలు కావస్తున్నా అమలు చేయడం లేదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేక వారి కుటుంబాలు గడవడం చాలా కష్టంగా మారిందని తెలిపారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ప్రతి నెలా రూ.10వేలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్‌బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గనబోయిన వెంకటేశ్, సామల భాస్కర్, నాయకులు ఉపేందర్, నరేశ్, కృష్ణ, షానవాజ్, ఎస్‌కే కరీం, సాయి, స్వామి, సత్యనారాయణ, శ్రీశైలం, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో దొంగ హల్‌చల్

- బైక్ అపహరణ.. మరో మూడు ఇండ్లల్లో దొంగతనానికి యత్నం

సీసీ కెమెరాకు చిక్కిన దొంగ

ఆత్మకూరు(ఎం), జూలై 28 : మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మోత్కూర్ – భువనగిరి ప్రధాన రోడ్డుకు అనుకోని ఉన్న వినాయక బైక్ షోరూం ముందు ఉంచిన పల్సర్ బైక్‌ను చోరీ చేశారు. ప్రధాన రోడ్డు వద్ద ఉన్న అజ్జల్ కిరాణ దుకాణంలోకి చొరబడి దొంగతనానికి ప్రయత్నించి విఫలమయ్యారు. మరో రెండు ఇండ్లల్లో దొంగతనానికి పాల్పడినప్పటికీ ఏమీ పోలేదు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి సీసీ కెమెరాలకు చిక్కాడు. అతనికి మరో వ్యక్తి సహకారం అందించినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బైక్ షోరూం యజమాని శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికులు ఉద్యమించాలి : సీఐటీయూ రాష్ట్ర నేత భూపాల్

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

రామన్నపేట, జూలై 28 : నూతన కార్మిక చట్టాలతో కార్మికుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని, వాటి రద్దుకు స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న సీఐటీయూ జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. నూతన లేబర్ కోడ్ – కార్మికులపై ప్రభావం అంశంపై వివరించారు. కార్యక్రమంలో నాయకులు శోభన్, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, దోనూరి నర్సిరెడ్డి, సోములు, పాషా, సురేందర్, భాగ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గౌస్‌కొండ గ్రామ కమిటీ

భూదాన్ పోచంపల్లి, జూలై 28 : మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంగూరి కొండల్, ఉపాధ్యక్షుడిగా కందుకూరి కిషన్, ప్రధాన కార్యదర్శిగా వంగూరి సురేశ్, సహాయ కార్యదర్శిగా కందుకూరి లింగస్వామి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య, నాయకులు స్వామి, గణేశ్, శ్రీను, అనిల్, నరసింహ, బాలరాజు, పరమేశ్, మహేశ్, నరేశ్, రాజేశ్, బన్నీ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా సత్తయ్య

చౌటుప్పల్, జూలై 28 : పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా తంగడపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు మోటె సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జాలిగామ రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకటయ్య ఆదివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఆర్థిక సాయం

భూదాన్ పోచంపల్లి, జూలై 28 : పట్టణంలోని 11వ వార్డు ప్రగతి నగర్‌కు చెందిన కటుకూరి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ అందించిన రూ.5వేల ఆర్థిక సాయాన్ని టీఆర్ యువసేన ఆధ్వర్యంలో మల్లయ్య కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ యువసేన అధ్యక్షుడు వలందాసు ప్రవీణ్, నాయకులు నరసింహ, పాండు, నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొమ్మాయిగూడెంలో..

రామన్నపేట : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన ఏఐటీయూసీ నాయకుడు గురిజాల లక్ష్మారెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందాడు. ఏఐటీయూసీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.26వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు బత్తుల సత్తయ్య, నాయకులు గణేశ్, రామలక్ష్మయ్య, శ్రీశైలం, మల్లేశం, రమేశ్, నర్సింహ, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఆలేరు మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తం

- సీపీఐ జిల్లా నాయకుడు వెంకటేశ్

ఆలేరు రూరల్, జూలై 28 : ఆలేరు మున్సిపాలిటీలో అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఆలేరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు అయిలి సత్తయ్య, గొట్టిపాముల శ్రీనివాస్, చౌడబోయిన కనకయ్య, పరశురాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మారెమ్మకు ఘనంగా బోనాలు

భువనగిరి కలెక్టరేట్ 28 : మండలంలోని అనంతారంలో గ్రామదేవత మారెమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పసుపు, కుంకుమ, పూలతో అలంకరించిన బోనాలతో డప్పు చప్పుళ్లు, శివసత్తుల ఆటపాటల మధ్య తరలి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిందం మల్లికార్జున్, వెంకటేశ్, కొండల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీకాంత్, చందు పాల్గొన్నారు.

ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

వన భోజనాలకు వెళ్తున్న పుట్టిగూడెం తండావాసులు

పుట్టిగూడెంలో వన భోజనాలు

రాజాపేట, జూలై 28 : మండలంలోని పుట్టిగూడెం తండావాసులు ఆదివారం వన భోజనాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వన దేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సమష్టిగా భోజనాలు చేశారు. సాంప్రదాయ నృత్యాలతో ఎంతో ఉల్లాసంగా గడిపారు.

'బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేయాలి'

ఆత్మకూరు(ఎం), జూలై 28 : బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేసి మండలానికి సాగునీరు అందించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో డబుల్ రోడ్డు, సారగండ్లగూడెం, మోదుగూబావిగూడేలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కాశీనాథ్, నాయకులు అబ్బయ్య, ఇంద్రారెడ్డి, సత్యనారాయణ, కుమారస్వామి, రాంరెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

తుమ్మల నర్సయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

నర్సయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, జూలై 28 : మాజీ ఎంపీపీ తుమ్మల నర్సయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అరూరు గ్రామానికి చెందిన స్వర్గీయ తుమ్మల నర్సయ్య సేవా సమితి ఆధ్వర్యంలో అరూరు, నర్సయ్యగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన తుమ్మల నర్సయ్య విగ్రహాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుమ్మల నర్సయ్య రెండు పర్యాయాలు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి పార్టీలకతీతంగా సేవలు అందించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు.

దివీస్ సేవలు అభినందనీయం

దివీస్ లేబొరేటరీస్ కంపెనీ చౌటుప్పల్ మండల వ్యాప్తంగా విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. దివీస్ కంపెనీ సహకారంతో మండలంలోని పహిల్వాన్‌పూర్, పులిగిల్ల, గోలిగూడెం, ఎం.తుర్కపల్లి, గోపరాజుపల్లి, గుర్నాథ్‌పల్లి, సుద్దబావిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్దన్‌రెడ్డి, నాయకులు రమేశ్, పద్మావతి, శ్రీనివాస్ యాదవ్, యుగంధర్‌రెడ్డి, సీఎన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, దివీస్ కంపెనీ ప్రతినిధులు సాయికృష్ణ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్ నివాళి



రామచంద్రమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూలై 28 : మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన కొసన రామచంద్రమ్మ మృతి చెందగా.. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం మృతదేహంపై పూలమాల ఉంచి నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మరిపెల్లి యాదయ్య, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, ఉప్పలయ్య, నర్సయ్య, అవిలిమల్లు ఉన్నారు.

రామన్నపేటలో సబ్ కోర్టును ప్రారంభించాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న మేక అశోక్‌రెడ్డి

రామన్నపేట, జూలై 28 : రామన్నపేటకు మంజూరైన జూనియర్ సివిల్ కోర్టును వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి కోరారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు మండలాలకు కేంద్రంగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు, అదనపు సివిల్ కోర్టులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయని, కేసుల సంఖ్య పెరుగడంతో జీఓ 50 ద్వారా సీనియర్ సివిల్ కోర్టును మంజూరు చేశారని తెలిపారు. రామన్నపేటకు మంజూరైన కోర్టును కొందరు చౌటుప్పల్‌కు తరలించడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, ఆనంద్, నర్సింహాచారి, నరేందర్, అంజయ్య, హన్మంతు, నరేశ్, విజయ, సైదులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

12వ వార్డులో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న కౌన్సిలర్ దేవరాయకుమార్, వార్డు సిబ్బంది

భూదాన్ పోచంపల్లి, జూలై 28 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 12వ వార్డు కౌన్సిలర్ దేవరాయ కుమార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 12వ వార్డులో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉన్న నీటిని తొలగించి శుభ్రపరుచుకోవాలని సూచించారు. దోమల నియంత్రణతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చేరాల ప్రకాశ్‌కు గౌరవ డాక్టరేట్

పుదుచ్చేరిలో గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న చేరాల ప్రకాశ్

భూదాన్ పోచంపల్లి, జూలై 28 : కళలు, సేవా, సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్నందుకు గాను భూదాన్ పోచంపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు, జానపద గాయకుడు, రచయిత చేరాల ప్రకాశ్‌కు రెండో గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని పుదు